క్లుప్తంగా

నేడు జోడో యాత్ర

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని పలు గ్రామాల్లో నేడు(బుధవారం) కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో హాత్‌సే హాత్ జోడో యాత్ర కొనసాగనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాత్ర రూపిరెడ్డిపల్లి, చెన్నాపూర్, దామరంచపల్లి, చిన్నకోడెపాక, బాలయ్యపల్లి, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి గ్రామాలలో కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో పాటు రైతులు, యువకులు, మహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నియామకం

కాటారం: తెలంగాణ ప్రదేశ్ ప్రచార కమిటీ మంథని డివిజన్ కన్వీనర్‌గా కాటారం మండలం ధన్వాడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ కారెంగుల తిరుపతిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ మధుయాష్కి మంగళవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబుకు, కాంగ్రెస్ నాయకులకు తిరుపతిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతిగౌడ్ నియామకంపై మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

కమిటీ ఎన్నిక

మహదేవపూర్: మహదేవపూర్ మండలంలోని బెగుళూర్‌లో మంగళవారం ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ కమిటీని మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొరల్లా ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా కొయ్యల అశోక్, కార్యదర్శిగా కొయ్యల సదానందం, ప్రధాన కార్యదర్శిగా కొయ్యల రాము, గ్రామ కోశాధికారిగా చెన్నూరి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాదిగ మాట్లాడుతూ.. ఏప్రిల్ 4న తెలుగు రాష్ట్రాల్లో జాతీయ రహదారుల దిగ్బంధం చేయడానికి సన్నద్ధం కావాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంథని రవితేజ, కొలుగూరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వివరాల సేకరణ

మల్హర్: మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం సేకరించారు. మండలంలోని తాడిచర్ల, పెద్దతూండ్ల, వల్లెకుంట, అన్సాన్‌పల్లి, నాచారం, తాడ్వాయి, మల్లెంపల్లి గ్రామాల్లో 325 లబ్ధిదారుల వివరాల సేకరించి, రికార్డులో నమోదు చేసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ జాబితాను పెద్దపల్లి జిల్లా ఆర్డీఓ కార్యాలయానికి పంపించినట్లు ఆయన వెల్లడించారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



కాటారం: జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఆ పార్టీ జిల్లా నాయకుడు సనత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రమేశ్, బండం ప్రణయ్, సురేశ్, రాకేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. మండలంలో పలు శాఖల ద్వారా ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులు, సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ఏటూరునాగారం: అక్రమ అరెస్టులు చేయడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు గండెపల్లి సత్యం అన్నారు. టీఎస్‌పీఎస్ ప్రశ్నపత్రాల లీకేజీ విషయంపై జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ నాయకులు వెళ్లకుండా పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది తెలంగాణ నిరుద్యోగుల జీవితాలతో ముడిపడి ఉన్న ఉద్యోగాలకు సంబంధించిన పరీక్ష పత్రాలు లీక్ కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీఎస్‌పీఎస్‌లో పనిచేసే వ్యక్తి ప్రవీణ్ పేపర్ లీక్ చేయడం బాధాకరం అన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కావేరి అర్జున్ ఉన్నారు.

కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలి



మహదేవపూర్: మాట్లాడుతున్న సంతోషిలత

కాళేశ్వరం: కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మల్టీడ్రగ్ తెరపి(ఎండీటీ)ద్వారా చికిత్స చేస్తే పూర్తిగా నయమవుతుందని స్టేట్ శాంపుల్ కం అసెస్మెంట్ యూనిట్ అధికారి డాక్టర్ సంతోషిలత తెలిపారు. ఆమె మంగళవారం కాళేశ్వరంలోని పీహెచ్‌సీలో రికార్డులు, రిపోర్టులను పరిశీలించి సమావేశంలో కుష్ఠు వ్యాధి నివారణ గురించి మాట్లాడారు. కుష్ఠు వ్యాధి నివారణ కోసం వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. చర్మంపైన మచ్చలు ఉన్న పలువురిని పరీక్షించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆమె వెంట డాక్టర్ ఉమాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి సుస్మిత, సమ్ము, రమణయ్య, శ్రీనివాస్, కీర్తి, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన

మహదేవపూర్: ప్రజలకు కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించాలని స్టేట్ ఆఫీసర్ డాక్టర్ సంతోషిలత అన్నారు. మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీలలో స్టేట్ శాంపుల్ కం అసెస్మెంట్ యూనిట్ నల్లకుంట హైదరాబాద్ వారు కుష్ఠువ్యాధి సంబంధించిన రికార్డ్స్ పోర్ట్సును పరిశీలించారు. కుష్ఠు నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా స్టేట్ ఆఫీసర్ డాక్టర్ సంతోషిలత కుష్ఠువ్యాధి లక్షణాలను, చికిత్స, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ (మల్టీ డ్రగ్ తెరపీ చికిత్స) ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఎండీటీ చికిత్స ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో పూర్తిగా అందుబాటులో ఉంటుందని, వ్యాధిగ్రస్తులపై ఎటువంటి వివక్షత చూపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు ఉమాదేవి, స్టేట్ టీం సభ్యులు ఖాదర్, నరసింహులు, అరుణ, సమ్ము, మల్లయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మిత, జగదీష్, హెల్త్ సూపర్‌వైజర్ మాషు ఖలి, సమ్ము, నిర్మలా, మేరీ, హెల్త్ అసిస్టెంట్లు అడప రాజరమణయ్య, సత్యనారాయణ, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ కీర్తి, ఏఎన్‌ఎంలు ఆశ వర్కర్లు సిబ్బంది, లెప్రసి కేసెస్ కాంటిజేంట్ వర్కర్ మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మంజులాదేవి

మొగుళ్లపల్లి: మండలంలోని మేదరమెట్ల, అంకుషాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఎపీడీ మంజులదేవి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో పెట్టిన కొలతల ప్రకారం కనీసం పని చేస్తే రూ.257 చొప్పున డబ్బులు పడుతాయన్నారు. ప్రతీ గ్రామంలో 60 మంది కూలీలకు పని కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నర్సరీలలో 100 శాతం మొక్కలు బ్రతికేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ కృష్ణవేణి ఏపీఓ కుమారస్వామి టెక్నికల్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఏటూరునాగారం: గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఖాజాపాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 4 వార్డులో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో మట్టిరోడ్లు అన్ని కూడా సీసీ రోడ్లు అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గండెపల్లి నర్సయ్య, కందగట్ల శ్రీనివాస్, వావిలాల ముత్తయ్య, కాళ్ల రామకృష్ణ, సైలనిబాబా, సాగర్, యాకూబ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్టీ హాస్టల్ వెనుకాల రోడ్డును నాల్గొవ వార్డు సభ్యురాలు మల్లమ్మ ప్రారంభించారు.

అంబేడ్కర్ చిత్రపటాల బహూకరణ



అంబేడ్కర్ చిత్రపటాలను అందజేస్తున్న విద్యార్థులు

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలకు 2021–22 సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసిన విద్యార్థులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరిగొప్పుల మాట్లాడుతూ.. విద్యార్థులు వారి గుర్తుగా రెండు అంబేడ్కర్ చిత్రపటాలను అందజేసినట్లు రాజేందర్ తెలిపారు. అంబేడ్కర్ ఆదర్శ ప్రాయుడని ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటాలను బహూకరించడం హర్షనీయం అని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిరిసిల్ల శ్రీనివాస్, శ్రీలత, రాకేశ్, సంధ్యారాణి, రాజయ్య, కృష్ణమాచారి, మంథెన శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ములుగు రూరల్: మండలంలోని పొట్లాపూర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ కుమ్మిత లలిత అంకిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించిన మిషన్ భగీరథ డీఈ సంధ్యారాణి, ఏఈ నర్సయ్యలను అడ్డుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరిపడా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కలెక్టర్ గ్రామంలో మంచి నీటి సమస్యపై దరఖాస్తులు చేసుకోగా మంచినీటి బావి తవ్వకానికి అనుమతులు ఇచ్చి రద్దు చేశారని అన్నారు. గ్రామంలో అదనపు ట్యాంక్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని అన్నారు. కాగా, గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టి ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం లబ్ధిదారులకు అందజేయాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు మంగళవారం అంకాషాపూర్, దస్తగిరిపల్లి, మేడిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. విద్యార్థులు, బాలింతలు, గర్భిణులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొని రిజిస్టర్లు పరిశీలించారు. రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలని మెనూ ప్రకారం భోజనం, కోడిగుడ్లు, పాలు, బాలామృతం లాంటివి అందించాలని ఆదేశించారు.

నర్సరీల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలి

హరితహారంలో భాగంగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణ జాగ్రత్తగా చేపట్టాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ అధికారులు, సిబ్బందికి సూచించారు. కాటారం మండలంలోని అంకుషాపూర్, బయ్యారం, మేడిపల్లి నర్సరీలను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. వేసవికాలం కావడంతో మొక్కలు ఎక్కువగా చనిపోయే అవకాశం ఉంటుందని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు రజిత, రాకేశ్, నవ్యశ్రీ, వాచర్లు ఉన్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ సతీష్

మహాముత్తారం: వ్యవసాయ అధికారుల సూచనలు పాటించినప్పుడే పంటలు దిగుబడి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సతీష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని కేశవాపూర్, నిమ్మగూడెం గ్రామాల్లోని వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొలాలకు అగ్గి తెగులు సోకుతున్నట్లు తెలిపారు. నత్రజని సంబంధిత యూరియా, అమోనియా వంటి ఎరువులను అధికంగా వాడటం, మబ్బుతో కూడిన వాతావరణం చిరుజల్లులు పడటం, పొలంలో, పొలంగట్లపై గడ్డిజాతి కలుపు మొక్కలు ఉండటం వలన ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. వాటి నివారణ కోసం ట్రైసైక్లోజోన్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోతియోలిన్ 1.5 మిల్లి లీటర్లు లేదా కాసుగా మైసిన్ 2.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. పొటాష్ ఎరువును ఈ సమయంలో వాడితే తెగులు తగ్గుముఖం పడుతుందని తెలిపారు. ఆ తర్వాత యురియా లేదా అమోనియా ఎరువులు వాడితే పంట దిగుబడి వస్తుందని తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చిట్యాల: నేటి నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ, ఆదర్శ జూనియర్ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు ఎన్ రాజ్‌కుమార్, రాకేష్ మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 335 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి 319 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు రాజ్‌కుమారు తెలిపారు. అలాగే ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 285 మంది, ద్వితీయ సంవత్సరానికి 271 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు రాకేష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, కావున విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని వారు పెర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జిరాక్స్ సెంటర్‌లను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూసి వేయాలని పేర్కొన్నారు. అలాగే పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో పేరెంట్స్ ఉండాలన్నారు. ఎవరైనా ఉల్లంఘించినటో చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు

కాటారం: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ దేవరాజం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన సంక్షేమ బాలుర కళాశాల, గంగారం మోడల్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మిడియట్ ప్రథమ సంవత్సరం మొదటి పరీక్షలో భాగంగా మూడు పరీక్షా కేంద్రాల్లో 593 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

టేకుమట్ల(రేగొండ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అంబాల చందుగౌడ్ తెలిపారు. మంగళవారం రేగొండ మండలంలోని సుల్తాన్‌పూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కంటి వెలుగు శిబిరంలో 122 మందికి కంటి పరీక్షలు చేసి, 64మందికి కంటి అద్దాలను అందించి, 14మందికి ఆర్డర్‌చేసి, 21 మందిని రెఫర్ చేసినట్లు కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ గౌతమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గండు కుమార్‌గౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు, ఆప్తాల్మిక్ డాక్టర్ వెంకటనారాయణ, హెల్త్ సూపర్ వైజర్ లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఏఎన్ఎం రాధిక, శారధ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'బిల్లు'కు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహదేవపూర్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉన్నప్పటికీ పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం లేదని అన్నారు. దేశంలో ఇష్టమొచ్చినట్లుగా ఎన్నో బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించుకుంటున్న బీజేపీ ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎందుకు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 04న హైదరాబాద్‌ను వేలాది మందితో దిగ్బంధం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని రవితేజ, రాజయ్య, లింగాల ప్రభుకుమార్, భిక్షపతి, రాము సుమన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



షీల్డ్ అందజేస్తున్న సునీల్‌రెడ్డి

మహాముత్తారం: మండలంలోని కనుకునూర్ గ్రామంలో ఏనక శ్రీనివాస్ స్మారకార్థం ఆదివాసీ గిరిజన సంఘం, అనసూయమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి నగదు, బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.10వేలతోపాటు కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహాభావం పెంపొందడమే కాకుండా శారీరదృడత్వాన్ని పెంపొందించుకోవచ్చని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి పూర్ణచందర్, నాయకులు సందీప్, రమేష్, సర్వేష్, శ్రీనివాస్, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

డీడబ్ల్యూఓను కలిసిన అంగన్‌వాడీ టీచర్లు



శైలజను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిట్యాల: ఇటీవల డీడబ్ల్యూఓగా పదవి చేపట్టిన శైలజను అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతల సంధ్యారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు జిల్లా కేంద్రంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు. నిత్యం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా సేవలు అందించడంతో పాటు మాతా శిశు సంక్ష సంరక్షణ కోసం అంకితభావంతో కృషి చేస్తున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆమెకు తెలిపారు. అనంతరం శైలజ స్పందిస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సెంటర్లను సక్రమంగా నడిపిస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రజిత, కవిత, ప్రాజెక్టు అధ్యక్షురాలు సునీత, నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, శ్రీవాణి, పద్మ, మమత, సునీత, స్వర్ణలత పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



గిద్దెముత్తారం పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



గోపాలపురం పాఠశాలలో..



కాళేశ్వరంలో..



గోరికొత్తపల్లిలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారం, గోపాల్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాలను నిర్వహించినట్లు ఆయా పాఠశాలాల ప్రధానోపాధ్యాయులు రవ్వ జగదీష్, నర్సయ్య తెలిపారు. గిద్దెముత్తారం పాఠశాలలో డీఈఓగా శివరాం సాయి, ప్రధానోపాధ్యాయులుగా శ్రీనిత్య, పీఈటీగా అజయ్‌తో పాటు వినూత్న ప్రసన్న, మహాలక్ష్మి, శివప్రసాద్ ఉపాధ్యాయులుగా వ్యవహరించినట్లు తెలిపారు. అలాగే గోపాలపూర్ పాఠశాలలో ఎంఈఓ గా పీసర ఉమేష్, ప్రధానోపాధ్యాయులుగా ఆరెపల్లి యశ్వంత్, శ్రీరామ్, నిత్య, ఏకు స్వాతి, రాకేష్, చల్ల నితిన్, ఈశ్వర్, యశ్వంత్‌లు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ తరగతి గదిలోనే నిర్మితమవుతుందని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు శ్రీ కాంత్, శోభన్, మంగాదేవి, రేణుకుంట్ల కుమార స్వామి, ప్రవీణ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం తమ అనుభవాలను పంచుకున్నారు.

టేకుమట్ల(గోరికొత్తపల్లి): గోరికొత్తపల్లి చైతన్య భారతి విద్యాలయంలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి పాఠాలు బోధించి వారి అనుభవాలను పంచుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా పూజిత, ఎంఈఓగా సహస్ర, పీఈటీగా మనోజ్, ఉపాధ్యాయులగా పలువురు విద్యార్థులు ప్రభను కనబర్చారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ప్రధానోపాధ్యాయులుగా పకిడె రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు స్వామి, సౌమ్య, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు 'కల్యాణలక్ష్మి' వరం

ఎస్ఎస్‌తాడ్వాయి: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరమని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ ముఖ్య లక్ష్యమని అన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ దేశానికే మార్గదర్శిగా మారారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, కోఆప్షన్ సభ్యుడు దిలావర్‌ఖాన్, ఎంపీటీసీ కుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.